ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

దొనకొండలో రక్షణ రంగ యూనిట్

- 1400 ఎకరాల భూమి కేటాయింపు
- పామూరు వద్ద పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు
- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

దొనకొండలో రక్షణరంగ పరికరాల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం 1400 ఎకరాల భూమిని కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు. ఇందులో 1200 ఎకరాలను ఒక్కో ఎకరానికి రూ.7.73 లక్షలు చెల్లించి రైతులనుంచి సేకరిస్తారు. మిగతా భూమిని మార్కెట్ ధర ప్రకారం సేకరించాలని నిర్ణయించారు. సిబ్బంది నివాసాల కోసం మరో 146 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. సిబ్బంది కోసం టైన్‌షిప్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ నుంచి రక్షణ రంగానికి అవసరమైన యుద్ధ పరికరాలు తయారు చేయనున్నారు. భారత డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ ఇక్కడ ఈ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఇక జిల్లాలోని పామూరు వద్ద వ్యూహాత్మక పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హడ్కో నుంచి 8.60 శాతం వడ్డీతో రుణం తీసుకుని ఇక్కడ పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్

▶ 2లో

సంక్షోభానికి దారితీస్తున్న

గ్రానైట్ సీనరేజీ వసూళ్లు

- ప్రయివేటు సంస్థకు అప్పగించడంతో రెట్టింపు చెల్లించాలని పట్టు
- అంత చెల్లించలేమంటూ ఈనెల 1 నుంచి ఫ్యాక్టరీల మూత
- పనులు నిలిచిపోయి కార్మికుల అవస్థలు.. ఉత్పత్తికి విఘాతం



సమ్మెతో మూతపడిన గ్రానైట్ ఫ్యాక్టరీ

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

గ్రానైట్ రంగంలో సీనరేజీ వసూళ్ల రాష్ట్ర ప్రభుత్వం ఏఎంఆర్ అనే సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ రెండేళ్లకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1140 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ఇక ఇక్కడ అన్ని వైపులా చెక్‌పోస్టులు పెట్టి వసూళ్లకు రంగం సిద్ధం చేశారు. సీనరేజీని ఇపుడు చెల్లించేదానికంటే రెట్టింపు కట్టాలని ఏఎంఆర్ సంస్థ పట్టుపట్టింది. దీంతో అంత చెల్లించలేమని, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కడతామని గ్రానైట పాలిషింగ్ ఫ్యాక్టరీ యజమానులు తేల్చేశారు. తాము నిర్ణయించిన ప్రకారం చెల్లించాల్సిందేనంటూ ప్రవేటు కంపెనీ బీష్మించుకుని కూర్చుంది. దీంతో ఇరువర్గాల మధ్య అవగాహన కుదరనందున ఈనెల 1 నుంచీ గ్రానైట్ ఫ్యాక్టరీలు మూసేసి ఆందోళన బాటపట్టారు. పలు దఫాలుగా చర్చలు సాగినా ఫలితం లేదు. ఎమ్మెల్యేల వద్దకూ పంచాయతీలు నడుస్తున్నాయి. ఈ పరిణామాలు గ్రానైట్ సంక్షోభానికి దారితీస్తున్నాయి.

ఇప్పటి వరకూ మైనింగు శాఖ రాయల్టీలను వసూలు చేస్తోంది. ఏడాదికి రూ.450 కోట్ల ఆదాయం గనుల ద్వారా వస్తోంది. పాలిషింగు యంత్రాల నుంచీ సీనరేజీ రూపంలో బ్లేడుకు రూ.27వేలు చొప్పున కడుతున్నారు. దాన్ని ఇపుడు జీఎస్‌టీతో కలిపి రూ.40వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని చెల్లిస్తామని గ్రానైట్ పాలిషింగు యజమానులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన మేరకు చెల్లిస్తే తమకు లాభం ఏముంటుందని ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. ఫ్యాక్టరీల్లోని ఒక్కో బ్లేడుకు రూ.70 వేలు కట్టాలని పట్టుపట్టారు. సగం ప్రభుత్వానికి కడితే సగం మాకుండాలని అంటున్నారు. ఇంత మొత్తంలో చెల్లించలేమని యజమానులు ఆందోళన బాటపట్టారు.

25 వేల మంది కార్మికులపై ప్రభావం

జిల్లాలో 2500 ఫ్యాక్టరీలున్నాయి. సుమారు 25 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. పెద్ద ఎత్తున ఉపాధి ఉంది. చీమకుర్తి ప్రాంతంలోనే 15 వేల మంది వరకూ పనిచేస్తుంటారు. గ్రోత్‌సెంటర్, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లోనూ ఫ్యాక్టరీలున్నాయి. ఇపుడు ప్రవేటు కంపెనీ దెబ్బకు అన్నీ మూత పడ్డాయి. కార్మికులకు ఉపాధి పోయింది. పనులు ఆగిపోయాయి. ఉత్పత్తి నిలిచిపోయింది. రాయిని కొనడం ఆపేశారు. దీనిపై క్వారీల యజమానులు ఎఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపినా కొలిక్కిరాలేదు. ఈ పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉంది. మంత్రులు పట్టించుకోవడం లేదు. అటు గనుల శాఖకూ ఆదాయం పడిపోయింది. ఫ్యాక్టరీల నుంచి సీజరేజీ రానందున ఏఎంఆర్ సంస్థ కూడా కడుతుందా?లేదా?అనేది చూడాలి. ఇక క్వారీలనుంచి తీసే రాయికీ

▶ 2లో

స్మార్ట్ రేషన్ కార్డులొచ్చాయ్..

- మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో మొత్తం 6.51 లక్షలు
- డీలర్లకు ఈ-పోస్ మిషన్లు పంపిణీ
- నేడు పంపిణీ చేయనున్న మంత్రి డిబివి స్వామి



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రేషన్ సరుకుల పంపిణీలో మోసాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వినియోగదారులకు పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఇస్తోంది. జిల్లాలో మొత్తం 6 లక్షల 5-వేల 818 స్మార్ట్ రేషన్ కార్డులను వినియోగదారులకు అందజేయనున్నారు. ఒంగోలు పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో రేషన్ సరుకుల పంపిణీలో మోసాలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇందులో భాగంగా పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త సభ్యులను చేర్చటానికి 2025 మే 7 నుంచి అవకాశం కల్పించారు. రేషన్ కార్డులలో మార్పులు చేర్పులు చేసుకున్న తరువాత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తున్నారు. రేషన్ డీలర్లకు పాత ఈ-పోస్ మిషన్ల స్థానంలో అభివృద్ధి చేసిన కొత్త -పోస్ మిషన్లను పంపిణీ చేసింది. రేషన్ సరుకుల అక్రమాల నిరోధానికి కొత్త సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం రూపొందించింది. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. వివిధ దశలలో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చివరి దశలో ప్రకాశం జిల్లాను ఎంపిక చేసింది.

జిల్లాలో 6.51 లక్షల కార్డులు

ప్రకాశం జిల్లాలో మొత్తం 6 లక్షల 51 వేల 818 రేషన్ కార్డులు ప్రస్తుతం పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో అంత్యోదయ అన్న యోజన(ఏఏవై), తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అంత్యోదయ అన్న యోజన కార్డులకు 35 కిలోల బియ్యం, తెల్ల రేషన్ కార్డుదారులకు ఒక్కొక్క సభ్యునికి 5 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఏఏవై కార్డుదారులకు చక్కెర కిలో రూ.13.50లు, తెల్ల రేషన్ కార్డుదారులకు అర కిలో చక్కెర 17 రూపాయలకు అందిస్తున్నారు. బియ్యానికి బదులుగా కార్డుదారులకు 2 కిలోల జొన్నలు, మరికొన్ని జిల్లాల్లో రాగులు పంపిణీ చేస్తున్నారు.

స్మార్ట్ కార్డులు పంపిణీకి సర్వం సిద్ధం

- ఎస్. పద్మశ్రీ, జిల్లా పౌర సరఫరాల అధికారి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సర్వం సిద్ధమైంది. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లాకు చేరుకున్నాయి. మండల తహశీల్దార్ల కార్యాలయాల నుంచి సచివాలయాలకు వెళ్ళనున్నాయి. సచివాలయ ఉద్యోగులు ఆయా డివిజన్లు, మండలాలు,

▶ 2లో

బెల్లం కోటయ్య పొగాకు కంపెనీలో

భారీ అగ్నిప్రమాదం

- 4.5 లక్షల కేజీల పొగాకు దగ్ధం
- రూ.557 కోట్ల నష్టం
- పరిశీలించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు





ఎగిసిపడుతున్న మంటలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలికివాయి పంచాయతీ పరిధిలోని బెల్లం కోటయ్య పొగాకు కంపెనీలో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. 4.5 లక్షల కేజీల పొగాకు దగ్ధం కాగా రూ.557 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మొదలైన మంటలు రాత్రి వరకు మండుతూనే ఉన్నాయి. ఈ గోడౌనును 2012 నుంచి గాడ్ ఫ్రై ఫిలిప్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ లీజుకు తీసుకొని పొగాకును గ్రేడింగ్ చేసి విదేశాలకు పంపిస్తుంది. ప్రమాదంలో ఫ్యాక్టరీలోని రెండు బ్లాకులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగాకు మొత్తం దగ్ధమైంది. గూడెం మొత్తం మంటలతో పొగలతో నిండిపోయింది. ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలు ఆర్పుతున్నారు. గ్రేడింగ్ పూర్తయిన బేళ్లతోపాటు గ్రేడింగ్‌కు సిద్ధమైన బేళ్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. మంటలను అదుపు చేసేందుకు తీవ్రమైన కసరత్తు చేస్తున్నామని వివరించారు. కంపెనీ జనరల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేవారు. అటు ఫైర్ సిబ్బంది ఇటు పోలీసులు ఆ కంపెనీ సిబ్బందితో ఉదయం నుంచి రాత్రి వరకు గూడెంలో మంటలు ఆర్పేందుకు తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు ఎర్రటి మంటలు రావడంతో పాటు ఆ తరువాత నల్లటి పొగతో ఆ ప్రాంతమంతా పొగతో కమ్మేసింది. శుక్రవారం సాయంత్రం కూడా ఇదే పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్సైలు బి.మహేంద్ర, వి.నాగమల్లేశ్వరరావు, మహేంద్ర, ప్రభాకర్ లు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. టంగుటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం కోటయ్యకు చెందిన ఈ పొగాకు గూడెం గత 12 సంవత్సరాల నుంచి జిపిఐ కంపెనీ లీజుకు తీసుకుంది. రెండు బ్లాకుల్లో మంటలు వచ్చి పొగాకు మొత్తం ఖాళీ బూడిదవడంతో అక్కడ ఉన్న సిబ్బంది సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. మిగతా బ్లాక్‌లో పొగాకు భారీ ఎత్తున ఉండటంతో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కాలిపోయిన పొగాకు



పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పురోభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్ కోరారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నడుస్తున్న పలు పథకాల అమలు తీరుపై దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. దిశ కమిటీ ఛైర్మన్ బాపట్ల ఎంపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 21 ప్రభుత్వ శాఖల పురోగతిపై సమీక్ష జరిగింది. పేదరిక నిర్మూలన, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పార్లమెంట్ సభ్యులు చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రజలందరికీ చేరవేయాలన్నారు. అధికారులు మంచి ఆలోచనలు, ఉన్నతమైన దర్శనంతో పని చేయాలన్నారు. పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లా మరింత అభివృద్ధి కానుందని ఎంపి చెప్పారు. రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్, రూ.88.43 కోట్లతో నిజాంపట్నంలో ఆక్వా పార్క్ నిర్మాణంతో అభివృద్ధి పట్టాలు ఎక్కనుందన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ.167.48 కోట్ల నిధులతో 403 పనులు పునరుద్ధరిస్తూ ప్రభుత్వ తాజాగా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. రూ.19.21 కోట్ల నిధులతో మంజూరు చేసిన 64 పనులు ఇంతవరకు ప్రారంభించకపోవడం ఏమిటని నిలదీశారు. జిల్లాలోని ఒక లక్ష మంది నిరుద్యోగ యువతకు శిక్షణలిచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఎంపి తెలిపారు. పక్కా గహాల లేఅవుట్లలో రూ.94.26 కోట్ల నిధులతో అంతర్గత రహదారులు నిర్మించాల్సి ఉండగా ఎందుకు జాప్యం అవుతుందని ప్రశ్నించారు.సూర్య ఘర్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ సౌర విద్యుత్ వెలుగులు కల్పించాలన్నారు. జిల్లాలో 86,719 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2,860 గహాలకు సౌర విద్యుత్ వెలుగులు కల్పించామన్నారు.బాపట్ల జిల్లాను అభివద్ధి పదంలో తీసుకెళ్లేందుకు అధికారులందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పథకాల అమలు తీరులో పురోగతి కనిపించాలన్నారు. జాతీయ రహదారి, పంట కాలువల వెంట విరివిగా మొక్కలు నాటాలన్నారు. పొలాల గట్లపై ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, ప్రకాశం జడ్పీ సీఈవో చిరంజీవి, గుంటూరు జెడ్పి సీఈవో జ్యోతి బసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులొచ్చాయ్.

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను కార్డుదారులకు అందజేయనున్నారు. ఒంగోలు ప్రకాశం భవనంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) సమావేశ మందిరంలో శనివారం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు. చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పి.రాజాబాబు, జెసి ఆర్.గోపాలకృష్ణ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

సంక్షోభానికి దారితీస్తున్న గ్రానైట్ సీనరేజీ వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కూడా రాయల్టీ రూపంలో ప్రవేటు కంపెనీకే చెల్లించాల్సి ఉంది. ఈ వ్యవహారం గుట్టుగా సాగింది. ఇక గ్రావెల్‌పైనా సెస్ వసూలు చేయాల్సి ఉంది. దీన్ని ఇప్పటి వరకూ ప్రభుత్వ పనులు చేసే కాంటాక్టర్ల నుంచీ వివిధ రూపాల్లో వసూలు చేస్తారు. ఇటుక, ఇసుక, కంకర సెస్ వసూలు చేస్తారు.ఇక నుంచీ ఏఎంఆర్ సంస్థకే చెల్లించాల్సి ఉంది. దీని వల్ల సామాన్యులపై భారం పడనుంది. ఇప్పటి వరకూ కంకర చిన్నచిన్న ఇళ్లు కట్టుకునేవాళ్లకు మామూలు రేటుకు సరఫరా చేస్తారు. ఇపుడు చెక్‌పోస్టులు పెట్టి కంకర గ్రావెల్‌కూ వసూలు చేస్తే ఆమేరకు జనంపై భారంపడనుంది. ఏదేమైనా ప్రవేటు కంపెనీలకు కప్పం కట్టాల్సిన పరిస్థితి రావడంతో సంక్షోభానికి దారితీస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే సీనరేజీ చెల్లిస్తామని యజమానులు చెబుతుండగా రెట్టింపు చెల్లించాలని ప్రవేటు కంపెనీ డిమాండు చేస్తోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మానసిక ఆరోగ్యం అందరి హక్కు

సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం

ప్రజాశక్తి-ఒంగోలు

మానసిక ఆరోగ్యం అందరికీ సమాన హక్కు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఒంగోలు నగరం సిరి హాస్పిటల్‌లో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హాస్పిటల్‌లో ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. మానసిక వ్యాధిగ్రస్తులు తయారుచేసిన ఉత్పత్తులను చూసి వారిని అభినందించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన పథకాలలో మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పథకాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జె.లక్ష్మణ్ కుమార్ రెడ్డి, వైద్యురాలు శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-చీమకుర్తి

69వ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గేమ్స్ పోటీలను ఎంఈఓలు డివిఎల్ నరసింహారావు, కే శివాజీ ప్రారంభించారు. శుక్రవారం ఆరు విభాగాలలో పోటీలు జరిగాయి. కబడ్డీ, కోకో, వాలీబాల్, పరుగు పందెం విభాగాలలో జరిగాయి.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలను డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని పోటీల కోఆర్డినేటర్ కెజస్వరూప వాణి తెలిపారు. గురువారం బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు జరిగాయి. కార్యక్రమాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంలు షణ్ముఖ కుమార్, పీడీలు కే హనుమంతరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 18 మద్యం దుకాణాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం చీమకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిఐ ఎం సుకన్య ఆధ్వర్యంలో వివిధ దుకాణాలలో కల్తీ మద్యం అమ్మకాలపై తనిఖీ చేపట్టారు. అదేవిధంగా కల్తీ మద్యం అమ్మకాలపై మరియు వివిధ అనుమానితుల గృహాలలో తనిఖీ నిర్వహించారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రైతులకు పోరాటం తప్ప మరో మార్గం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య తెలిపారు. ఏపీ రైతు సంఘం మార్టూరు మండల 3వ మహా సభ స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాల యంలో శుక్రవారం మండల శాఖ అధ్యక్ష, కా ర్యదర్శులు పాలేపు సాంబయ్య, వీరవల్లి కృష్ణ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. హాజరైన రైతు లను ఉద్దేశించి వలేటి కృష్ణయ్య మాట్లాడారు. అనంతరం సాయంత్రం స్థానిక కొణిదెన రోడ్డు లోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేం దుకు కార్పొరేట్ శక్తులతో కలిసి కుట్రపూరితంగా వ్యవహరిస్తూ బలవంతపు భూ సేకరణకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వ్యవసాయరంగా న్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకోలేకపోతే వ్యవసాయంలో రైతులు మనుగడ కోల్పోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, తలపనేని రామారావు, సిఐటియు నాయకులు బత్తుల హనుమంతరావు,ఎనికపాటి రాంబాబు, బొడెంపుడి సూరిబాబు, పేర్ని నాగేశ్వరరావు, నాగబోయిన సాంబయ్య, గాడిపర్తి నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

కేసుల పురోగతిపై ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ శుక్రవారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో మొట్టమొదటిసారిగా నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలు, విచారణ దశలో ఉన్న కేసుల పురోగతి తెలుసుకున్నారు. పలువిషయాలపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విచారణ దశలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వేగవంతంగా దర్యాప్తు నిర్వహించి కేసుల పెండెన్సీ తగ్గించాలన్నారు. మిస్సింగ్ కేసులు, గుర్తుతెలియని వారి మరణాలకు సంబంధించిన కేసులలో దర్యాప్తు వేగవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఏమ్.డి. మోయిన్, సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, డిసిఆర్బి డిఎస్పి బాలమురళీకష్ణ, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

భూములు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా : జిల్లాలో దేవాదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షించ డానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో దేవాదాయశాఖ భూముల పరిరక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ శాఖకు చెందిన భూములు, ఆస్తుల వివరాలను మండలాల వారీగా జాబితాలను తయారు చేయాలని ఆయన అధికారులకు చెప్పారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మద్దిపాడు : మండల కేంద్రమైన మద్దిపాడులోని సంతనూతలపాడు నియోజకవర్గ వైసిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టరును వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను నిరసిస్తూ "ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ" వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించి పేరు తెచ్చుకోండి: ఎంపీపీ

ప్రజాశక్తి-మర్రిపూడి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి మంచిపేరు తెచ్చుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వాక వెంకట రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. మండల స్థాయిలో మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగుతుంది తప్ప సమస్యలను పరిష్కరించకపోగా ఈ సమావేశాలకు అధికారులు గైర్హాజరవడం ఆనవాయితీగా మారిందని సభ్యులు వాపోయారు. మర్రిపూడి సొసైటీ చైర్మన్ యర్రమోతు శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వెంకటేష్, విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ మాట్లాడారు. మర్రిపూడి-పొదిలి ఆర్అండ్‌బి రహదారిలో మర్రిపూడి గీతాంజలి స్కూల్ దగ్గర నుంచి పిల్లిగుండ్ల వాగు దగ్గర వరకు రోడ్డులో గల గుంతలను పూడ్చి మా ప్రాణాలను కాపాడండని సభ్యులు ఆర్అండ్‌బిఏఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో షేక్ నాగూర్‌వలి, ఏవో వెంకటేష్, ఏపీవో రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ షేక్ సుకూర్, సిడిపిఓ బి సుశీలాదేవి, ఎంపీటీసీ సభ్యులు యు చిరంజీవి, కే బ్రహ్మానందరెడ్డి, శ్రావణి, సర్పంచులు కె భాస్కర్, రమణారెడ్డి, పిఎస్‌లు బీటీ నాయుడు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

పాలసీలను విరివిగా అమ్మాలి

ప్రజాశక్తి-పొదిలి

ఎల్ఐసి ఏజెంట్లు యూలిప్స్ పాలసీలను విరివిగా అమ్మడం ద్వారా పాలసీదారులకు అధిక లాభాలు అందించే విధంగా చూడాలని నెల్లూరు డివిజన్ ప్రోడక్ట్ మేనేజర్ ఏ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక శాటిలైట్ బ్రాంచ్ కార్యాలయంలో మేనేజర్ గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఐసిలో యూలిప్ పాలసీలు మంచి లాభాలు అందిస్తున్నాయని వివరించారు. మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకొని ఎంపిక చేసిన కంపెనీలలోనే పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎల్ఐసి పాలసీదారులు మంచి లాభాలను గ్రహించిన సందర్భాలను ఆయన వివరించారు. ప్రస్తుతం యూలిప్ పాలసీలతో పాటు కన్వెన్షన్, మనీ బ్యాక్ వంటి మంచి పాలసీలు ఎల్ఐసిలో ఉన్నాయని, ఈ ఉత్పత్తులను అమ్మడం ద్వారా ఏజెంట్లు ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. తన పరిధిలో ప్రతి ఒక్కరినీ పాలసీదారులుగా చేర్చడం ద్వారా వారికి పొదుపు, ఆర్థిక రక్షణ కల్పించిన వారమవుతావని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్ ప్రసన్నకుమార్, ఏఏఓ సుబ్బారావు, అభివృద్ధి అధికారులు చిరంజీవి, వీరయ్య, ఏజెంట్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఈ నెల 12న ఆదివారం సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ వారి పర్యవేక్షణలో సంతనూతలపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల రెండో ఆదివారం సంతనూతలపాడులో పోలీస్ స్టేషన్ సమీపంలో గల సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయం ఆవరణలో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి ప్రముఖ వైద్యులు చాపల వంశీకృష్ణ తదితర వైద్య బృందం ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, షుగర్, బిపి, థైరాయిడ్ వ్యాధులకు వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు.

కంది పంట పరిశీలన

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఆత్మసంస్థ సహకారంతో శుక్రవారం కంది పంటపై ఫాన్స్ స్కూల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.జోష్ణాదేవి మాట్లాడుతూ ఫామ్ స్కూల్లో ఆరు సెషన్స్ నిర్వహించాలని తెలిపారు. మొదటి సెషన్‌లో రైతులను ఎంపిక చేయడం, మట్టి పరీక్షల ప్రాముఖ్యత, మట్టి నమూనాల సేకరణ చేసినట్లు తెలిపారు. రెండో సెషన్లో కందిలో విత్తన శుద్ధి చేయడం గురించి వివరించారు.

అవినీతి, అక్రమాలపై..

విచారణ నివేదికలు బుట్ట దాఖలేనా?

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వి శ్రీదేవి ప్రవర్తనలో మార్పు రావడం లేదు. ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో ఆమె దొరికిపోయింది. బియ్యం దగ్గర నుంచి కోడిగుడ్ల వరకు నొక్కేసినట్లు ఆరోపణలున్నాయి. దాంతో పాటు ఆ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఇతర పాఠశాలల్లో చేరేందుకు, 10వ తరగతి పూర్తయిన వారు టీసీ కావాలంటే రూ.500 వసూలు చేస్తున్నారు. నెలనెలా రూ.లక్షకు తగ్గకుండా అక్రమంగా ఆదాయాన్ని గడించిందనే అపవాదు ఉంది. ఇటీవల కాలంలో ఆమె అవినీతి వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలోనూ అక్రమం నిజమని తేలింది. విచారణ నివేదికలు విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు అప్పట్లో విచారించిన అధికారులు చెప్పారు. ఆ నివేదికపై చర్యలు తీసుకోకపోవడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులపైనా అనుమానించక తప్పడం లేదు! ఉన్నతాధికారులను సైతం ప్రలోభాలతో నియంత్రించినట్లు సమాచారం!!

విచారణలే.. చర్యలు శూన్యం..

ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అవినీతి భాగోతం మరువక ముందే మరో ఘన కార్యానికి పాల్పడింది. ఆ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కీర్తన అనే బాలిక బడికి ఆలస్యంగా వచ్చింది. ఇంటి దగ్గర ఇబ్బంది కారణంగా ఆలస్యమైందని చెప్పినా వినిపించుకోకుండా దాడికి పాల్పడింది. ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో కీర్తన అనారోగ్యానికి గురైంది. ఆమె దాడి కారణంగా ఆ బాలిక ఫిట్స్ వ్యాధికి గురైంది. ఆ బాలికను పరీక్షించిన వైద్యులు కూడా తలపై దాడి కారణంగా ఇదంతా జరిగిందని చెప్పినట్లు తెలిసింది.



విచారిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్ (ఫైల్)

ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ప్రవర్తనపై సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్‌కు ఫిర్యాదు చేశారు. తాజాగా గడిచిన గురువారం ఆ పాఠశాలను సబ్ కలెక్టర్ త్రివినాగ్ సందర్శించారు. గతంలో అవినీతిపై చేసిన విచారణ చేపట్టి మాసాలు గడిచినా చర్యలకు దిక్కులేదు. మరోసారి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి వ్యవహారంపై విచారణ చేపట్టారు. నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. అప్పట్లో విచారణ చేపట్టింది, తాజాగా విచారణ చేపట్టింది కూడా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాత్రమే. ఆయన గారు విచారణ చేపట్టడమే కానీ... చర్యలు శూన్యమేనని చర్చ సాగుతోంది. విచారణ నివేదికలు ఉన్నతాధికారుల వరకు వెళుతున్నాయో... లేక ఇక్కడే ఆగిపోతున్నాయో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. ఆ ప్రధానోపాధ్యాయురాలు అక్రమాలు చేసినా.. పిల్లల నోరుకొట్టి సంపాదించినా.. ఏకంగా పిల్లలపై శాడిజాన్ని ప్రదర్శించినా ఏమీ చేయలేరనేది మాత్రం నిజం! ఆ పాఠశాలలో కొనసాగుతున్న అక్రమాలు, శాడిజం అందుకు నిదర్శనం!!

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

ప్రజాశక్తి-శింగరాయకొండ

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు దుర్మార్గంగా అప్పచెప్పి రాష్ట్రంలోని పేద విద్యార్థులకు, మెడికల్ విద్యను, అలానే పేద ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తున్న తరుణంలో రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పిలుపు మేరకు శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు వై వెంకటేశ్వరరావు, కెవి రమణారెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ డాక్టర్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి,



కోటి సంతకాల సేకరణలో వైసీపీ నాయకులు

శింగరాయకొండ మండల పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, టంగుటూరు పార్టీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్టేట్, జిల్లా, నియోజకవర్గం, మండల అనుబంధ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు వైద్యం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కొండపి

ఆర్ఎంపీలు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాఎని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల ఒక ఆర్ఎంపి చేసిన వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో శుక్రవారం ఆయన కొండపిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తదుపరి వైద్యం నిమిత్తం సర్టిఫైడ్ డాక్టర్లకు రిఫర్ చేయాలన్నారు. అలా కాకుండా సెలైన్లు కడుతూ ఇంజక్షన్లు చేస్తూ వైద్యంచేసే వారిపై పోలీసు వారి సహకారంతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల క్రితం జరిగిన సంఘటన నేపథ్యంలో ఆ క్లినిక్‌లను పరిశీలించబోయేసరికి ఆర్ఎంపీలు తాళాలు వేసుకొని వెళ్లారని, ఆ ఇంటి యజమానులతో కూడా ఫోన్లో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వాణిశ్రీ సిహెచ్ సీ సూపర్డెంట్ కుంబా నాగమణి,వైద్య సిబ్బంది,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లినిక్‌కు తాళం వేసిన వైద్యశాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

ముందస్తు సమాచారంతో క్లినిక్‌లకు తాళాలు

డీఎంహెచ్వో వస్తున్నారనే సమాచారంతో ముందు రోజే ఆర్ఎంపీలు అప్రమత్తమై తమ క్లినిక్ లలోని ఎక్సరే మిషన్లు ఫిజియోథెరపీ పరికరాలు రక్త పరీక్షకు సంబంధించిన పరికరాలు తదితరాలను పక్కకు తప్పించినట్లు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ముందస్తు సమాచారం రావడంతోనే ఆర్ఎంపీలు క్లినిక్లను ఖాళీ చేశారని ఈ విధంగా సమాచారాలు రావడంతో ఆర్ఎంపీలు తప్పించుకుంటున్నారని, వైద్యం చేసే ఆర్ఎంపీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సైన్సు సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ బి హరిబాబు ఆవిష్కరించారు. శుక్రవారం మూలగుంటపాడులోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో చెకుముకి సైజు సంబరాల పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన పాఠశాలల్లో నవంబర్ ఒకటో తేదీన మండల స్థాయి నవంబర్ 23న జిల్లా డిసెంబర్ 12 నుంచి 14 వరకు రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటపాటి నారాయణ, పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వంరావు, ఎంవివి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిఎన్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 37 మంది బాధితులకు ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం 37 మందికి రూ.17.20 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ చెక్కులను స్థానిక శాసన సభ్యులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ చెక్కుల ద్వారా బాధితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా ఆదుకుంటున్నట్టు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తెలిపారు. బాధితులు వీటిని సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సంతనూతలపాడు మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంటు టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, మాజీ జడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కే గోపికృష్ణ, టిడిపి నాయకులు ఆళ్ల అవినాష్, బొడ్డపాటి చంద్రశేఖర్, కూకట్ల శరత్‌బాబు, నాగరాజు, పి రాము, టి శ్రీనివాస్‌రెడ్డి, ఎం రాంబాబు, ఆళ్ల రంగయ్య పాల్గొన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ఈ నెల 13వ తేదీ నుంచి 25 శాతం రాయితీపై శనగ విత్తనాల కోసం గిద్దలూరు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుందని, మండలంలో శనగ పంట సాగు చేసే రైతులు తమతమ రైతు సేవాకేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వై విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనగ విత్తనాలు కావలసిన రైతులు పట్టదారు పాసుబుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఎకరాకి 40 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జేజి-11 రకం, కాక్-2 రకం అందుబాటులో ఉన్నాయని, వీటి ఖరీదు క్వింటా రూ.7,800 కాగా సబ్సిడీ రూ.1,950 పోను రైతు రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందని ఏఓ తెలిపారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు

ప్రజాశక్తి - కనిగిరి

ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు జరుగుతున్నట్లు ఐద్వ నాయకులు షేక్ షమీల కోరారు. మహాసభల సందర్భంగా లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన పట్టణంలోని సుందరయ్య కాలనీలో జెండా శుక్రవారం ఆవిష్కంచారు. మహిళలపై జరిగే దాడులు, అత్యాచారాలు అరికట్టేందుకు, మద్య నిషేధం అమలు జరిగేలా సమాజ మార్పు కోసం ఐక్య పోరాటం చేయాలని పేర్కొన్నారు. సమాన హక్కుల సాధన కోసం, లింగ వివక్ష రూపుమాపేందుకు పాటుపడాలని కోరారు. మహిళల రక్షణ చట్టాలు అమలు చేయడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలం అవుతుందన్నారు. ఐద్వ నాయకులు రత్తమ్మ, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, కృపమ్మ, లాల్ బీ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ నాయకులు

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలో జరిగిన పోరుబాటలో తీసుకున్న నిర్ణయం మేరకు బోధనేతర కార్యక్రమాలు బహిష్కరించినట్లు తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ దీప్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వి సాంబశివరావు, షేక్ నాయబ్ రసూల్, తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్‌బాబు, ఎస్ వెంకట రామయ్య, డి సుబ్బరాయుడు, ఇర్ల కొండయ్య, కె చెన్నయ్య, జి లక్ష్మీ నారాయణ, ఎస్ గాంధీ, కె వెంకటేశ్వర్లు, హమ్మద్ పాల్గొన్నారు.


వర్క్‌షాపుకు హాజరైన విద్యార్థులు

డేటా స్ట్రక్చర్స్‌పై వర్క్‌షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో డేటా స్ట్రక్చర్స్ అల్గోరిథంపై 9 రోజుల వర్క్‌షాపు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీశ్ బాబు, బెంగుళూరు సిఎస్ఇ, లారా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో బిటెక్ 3వ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఒడి డాక్టర్ పొగడదండ హరిణి మాట్లాడారు. డేటా స్ట్రక్చర్స్ అల్గోరిథమ్స్‌పై ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అవగాహన ఉండాలని పేర్కొన్నారు. లారా టెక్నాలజీస్ సంస్థ నిపుణుడు రమేష్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, టి శేష సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ బి పోతురాజు తెలిపారు.

వేమూరు : వేమూరు, పెరవలి సబ్‌స్టేషన్ల ఫీడర్ల నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 నుండి 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

భట్టిప్రోలు : విద్యుత్ మరమతుల కారణంగా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - దర్శి



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 12వ వేతన సంఘం నియమించాలని మాజీ శాసన మండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సిఐటియు, యుటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో తాండవ రంగారావు అధ్యక్షతన స్థానిక పిజిఎస్ కళ్యాణ మండపంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. గత వైసిపి, ఇప్పటి కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేసినప్పుడు వేతనాలు పెంచుతామని ఇచ్చిన వాగ్దానం నేటికి అమలు కాలేదని అన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 6డిఎలు ఇవ్వవలసి ఉండగా ప్రకటించడం లేదని అన్నారు. అందుకోసం పోరాటాలు తప్ప మరే మార్గం లేదని చెప్పారు. ముందుగా ప్రపంచ విప్లవకారుడు చేగువేరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభలు దరిశిలో జయప్రదంగా జరగాలని పట్టణ మేధావులు, ఉద్యోగులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ రాభోవు కాలంలో సిఐటియు ఉద్యోగ, కార్మికుల భవిష్యత్తు ప్రణాళికను ఈ మహాసభల్లో నిర్ణయిస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రదర్శన, బహిరంగ జరుగుతుందని తెలిపారు. సభకు సిఐటియు రాష్ట్ర నాయకులు వస్తారని తెలిపారు. యుటిఎఫ్, జెవివి నాయకులు మీనిగ శ్రీనివాసరావు, రాజశేఖర్, ఆశా, అంగన్‌వాడీ నాయకులు షేక్ ఫాతిమా, తిరపతమ్మ, కెవి పిచ్చయ్య, జి శ్రీనివాసరెడ్డి, బి హనుమంతరావు, ఉప్పు నారాయణ, ఆదినారాయణ, జాన్ సామ్యేల్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పల్లెల పరిశుభ్రతలో క్లాప్ మిత్రలు కీలకం

ప్రజాశక్తి - బాపట్ల


ఈతేరులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సీఈఓ

పల్లెలు, పట్టణాల పరిశుభ్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పథకాలు అమలకు కేటాయిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జెడ్‌పి సిఇఒ జ్యోతి బసు అన్నారు. మండలంలోని ఈతేరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఘన, ద్రవ వ్యర్థాల సేకరణ నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజా ఆరోగ్యం కాపాడటంలో క్లాప్ మిత్రాల పాత్ర ప్రధానమైందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి బాబురావు, ఈతేరు సర్పంచ్ దమ్ము మార్తమ్మ, పంచాయతీ కార్యదర్శి షణ్ముఖరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల


జెవివి స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న డిఇఒ పురుషోత్తం

విద్యార్థులకు ఉచితంగా అందజేసే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డిఇఒ ఎస్ పురుషోత్తం అన్నారు. 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్ష నమూనా మెటీరియల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు సౌజన్యంతో ఉచితంగా అందజేయడం అభినందనీయమని అన్నారు. యుటిఎఫ్ జిల్లా బాధ్యులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, నన్నేరయ్య, బివి శ్రీనివాసరావు, రమేష్, కళాధర్, బాపూజీరెడ్డి, రంగారెడ్డి, సాంబయ్య, శేషుబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న సూపర్వైజర్ సంపూర్ణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. సూపర్వైజర్ సంపూర్ణ ఐలవరంలో కిషోర్ బాలికలకు బాల్య వివాహాలు, చట్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం మాచర్ల మోహనరావు పాల్గొన్నారు.

వేటపాలెం : ఈనెల 8న కొలలపూడి జెడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన డివిజన్ స్థాయి అండర్ - 14, 17 బాలికల వాలీబాల్ పోటీల్లో దేశాయిపేట విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి విజయలక్ష్మి విజేతలైన విద్యార్థులు, పిఇటి ఆర్ శివయ్యను అభినందించారు.

కర్లపాలెం : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని గణపవరం పాఠశాల హెచ్ఎం ఎన్ శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఉల్లిపాలెం పాఠశాలలో జరిగాయి. కబడ్డీ, చెస్ ఆటలు నిర్వహించారు. అండర్17 చెస్‌లో ఏ నాగ జ్యోతి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఐలవరంలో జరిగిన యోగా పోటీల్లో అండర్14 లో ఏ జగన్ మోహన్ రెడ్డి, ఎ కళ్యాణి, అండర్17 బాలురులో ఎం విజయకార్తిక్, ఎస్‌వి తనూజ్‌రెడ్డి, సిహెచ్ రూపేష్ కుమార్, బాలికల విభాగంలో బాలకృష్ణ వేణి, వి భవిష్య ఎంపికయ్యారు.


విద్యార్థులను అభినందిస్తున్న కర్లపాలెంపాఠశాల సిబ్బంది


మాట్లాడుతున్న వల్లభనేని బుచ్చయ్యచౌదరి

ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీ వెలగపూడి రామ కృష్ణ స్మారక కళాశాల దివీస్ లాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహించినట్లు కళాశాల కరెస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ తెలిపారు. తీర ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో దివీస్ లేబొరేటరీస్ సహకారంతో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన 60మంది యువతీ, యువకులు హాజరు కాగా 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. 28 మంది ఫిబ్రవరిలో జరుగు సెకండ్ ఫేజ్‌కు షార్ట్ లిస్ట్ అయ్యారని తెలిపారు. కార్యాలయ అధికారి పి అమరేష్‌రెడ్డి ఎంపికైన అభ్యర్థులను అభినందించారు.


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్‌ఖ వి వీరరాఘవయ్య

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

రెడ్‌క్రాస్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య ఆధ్వర్యంలో ఎబిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రథమ చికిత్సపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణం ఎలా కాపాడాలి, పరిస్థితి దిగజారకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై నిపుణులైన డాక్టర్ల చేత అవగాహన కల్పించారు.


ర్యాలీలో భాష్యం స్కూలు విద్యార్థులు

ట్రాఫిక్ సమస్యపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యపై అవగాహనపై కల్పించేందుకు భాష్యం స్కూల్ విద్యార్థులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ హృదయ రాజ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మాత్రమే రహదారి భద్రతను కాపాడగలమని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ప్రోత్సహించడం తల్లిదండ్రులు చేస్తున్న పెద్ద పొరపాటని అన్నారు. ఒకప్పుడు చిన్న పట్టణంగా ఉన్న బాపట్ల ప్రస్తుతం జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందడంతో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి సాంబశివరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషాలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 36 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం మూడు ఖాళీలనే చూపించారని, నల్లమడుగుల, పెదరాజపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో, పెదగోగులపల్లి యూపీ పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పోస్టులను డీఎస్సీ నూతన ఉపాధ్యాయులకు చూయించలేదని పేర్కొన్నారు. ఏడు పిఈటి పోస్టులు ఖాళీగా ఉండగా రెండు మాత్రమే చూయించారని తెలిపారు. 10 మంది సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీ కోరుకున్నప్పటికీ రిలీవర్ లేక పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.


జెండావిష్కరణ సందర్భంగా మాట్లాడుతున్న మాలతి

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సమానత్వం కోసం, సమాన హక్కులు, చట్టాల సాధన కోసం, ఉద్యమిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ఎన్ మాలతి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలం బి మాచవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఐద్వా జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా 1981లో ఏర్పడిన ఐద్వా (మహిళా సంఘం) నేడు దేశవ్యాప్తంగా విస్తరించి మహిళల హక్కులు, చట్టాల సాధన కోసం పోరాడుతున్నదని తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరుగుతున్న మహాసభలు జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రాయపూడి ఆదెమ్మ, అన్నవరపు ఈశ్వరమ్మ, పిచ్చమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బాలికల గురుకుల కళాశాలలో ఎమ్మెల్యే తనిఖీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం రాచర్ల ఫారం గ్రామం వద్ద గల బాలికల గురుకుల కళాశాలను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో రాత్రి స్టడీ అవర్లో ఉన్న బాలికల పుస్తకాలు నోటు బుక్కులు పరిశీలన చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్య, మౌళిక సదుపాయాలు, భోజన వసతుల్లో లోటుపాట్లు ఉన్నట్లైతే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. గురుకుల కళాశాలలో తాగునీరు సమస్యను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెంటనే ఫోన్ ద్వారా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించిన మంత్రి స్వామి తక్షణమే కళాశాలకు రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల టిడిపి అధ్యక్షులు కటికే యోగానంద్, రాచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ జీవనేశ్వర్‌రెడ్డి, రాచర్ల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కంభంలో ఎక్సైజ్ శాఖ దాడులు

ప్రజాశక్తి-కంభం

కంభం పట్టణంలో గంజాయి దందాపై సమాచారం మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి శుక్రవారం కంభం గ్రామంలోని అర్బన్ కాలనీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు వారి ఇళ్లను, ఒక టీ షాపును పరిశీలించారు. అయితే అక్కడ గంజాయి లేదా ఇతర నిషేధిత పదార్థాలు ఏవీ లభ్యం కాలేదు. తదనంతరం అర్బన్ కాలనీ నివాసితులకు గంజాయి సేవించడం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు.

మహదేవ తొలగింపుపై ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు

ఆల్ ఇండియా గ్రామీణ ధాక్ సేవక్ జనరల్ సెక్రటరి ఎస్ఎస్ మహదేవయ్యను సర్వీసు నుంచి తొలగించాలని నోటీసు ఇవ్వడాన్ని నిరశిస్తూ.. ఆ ఆర్డర్‌ను వెంటనే రద్దు చేసి విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒంగోలు హెడ్ పోస్టాఫీసు వద్ద ఎఐజిడిఎస్‌యు, ఎన్ఎఫ్‌పిఇ, ఎఫ్ఎన్‌పిఓ యూనియన్ల ఆధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్లకు అతీతంగా ఈ నిరసన కార్యక్రమానికి 100 మంది గ్రామీణ డాక్ సేవకులు, తపాల శాఖ ఉద్యోగులు ప్రకాశం డివిజన్ నలుమూలల నుంచి పాల్గొన్నారని ఎఐజిడిఎస్‌యు డివిజినల్ సెక్రటరీ ఎం పోలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు ఎ హరిబాబు, ఎస్ వెంకటరెడ్డి, పి శంకరనాయక్, కె సిద్ధయ్య, శ్రీకాంత్, పి వెంకటేశ్వరరావు, ఎ శైలజ, ఎన్ శ్రీనివాస కుమార్, ఎం పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: తపాలా ఉద్యోగులకు అండగా నిలిచిన ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ ప్రధాన కార్యదర్శి మహాదేవను తొలగించాలని నోటీసు ఇవ్వడంపై పోస్టల్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నోటీసు వెనక్కు తీసుకోవాలని కోరుతూ స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాఅషస్ యూనియన్, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్‌లు ఈ నిరసన కార్యక్రమాన్ని సంయుక్తంగా చేపట్టాయి. 2023 డిసెంబర్‌లో 'గ్రామీణ డాక్ సేవక్' ఉద్యోగుల హక్కుల సాధన కోసం అప్పట్లో నోటీసు ఇచ్చారన్నారు.


ఒంగోలులో నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ప్రభుత్వం సమ్మె జరపకూడదని నోటీసు ద్వారా అప్పట్లో హెచ్చరించింది. ఆ నోటీసులను వ్యతిరేకిస్తూ భారతదేశ వ్యాప్తంగా గ్రామీణ బ్యాంక్ సేవక్ ఉద్యోగులందరూ ఆ సమ్మెలో పాల్గొన్నారని గుర్తు చేశారు. మహదేవకు దేశవ్యాప్తంగా అండగా నిలుస్తామని, ఉద్యోగుల హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఉద్యోగం నుంచి మహదేవను తొలగించాలనుకోవడం నిరంకుశమేనని అన్నారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిూస్ రాష్ట్ర సర్కిల్ సహాయ కార్యదర్శి, నూనె రమణారెడ్డి, గ్రూప్-సి నాయకులు ఐ శంకర్, ప్రసాద్, మాజీ డివిజన్ కార్యదర్శి గ్రూప్-డి బీవీ రమణ, డివిజనల్ అధ్యక్షుడు ఏఐపి గ్రూప్-సి డి నారాయణరెడ్డి, డివిజనల్ కార్యదర్శి ఏఐజీడిఎస్‌యు ఆర్ శ్రీనివాసులు, ఏఐజిడిఎస్‌యు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం: అన్నా

ప్రజాశక్తి-మార్కాపురం

వైద్య విద్యతో పాటు వైద్య సేవలు ప్రభుత్వ ఆధీనంలో ఉండాలనే లక్ష్యంతో వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు తీసుకురావడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకటరాంబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం 11 మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధంగా ఉందని, ప్రైవేటీకరణ తగదని గట్టిగా అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాలలో ఐదింటిని ప్రారంభించారన్నారు. మరో రెండు పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగాయన్నారు. మిగిలినవన్నీ నిర్మాణంలో ఉన్నాయన్నారు. మన మార్కాపురంలో కూడా మెడికల్ కళాశాలకు చెందిన పూర్తయిన భవనాలు కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్య పెట్టేందుకు సిద్ధపడుతోందన్నారు. ఏదో ఒక రూపంలో ప్రైవేటీకరణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోందన్నారు. కోటి సంతకాలతో ప్రభుత్వ వైద్య, విద్య అవసరమైన విషయాన్ని రాష్ట్ర గవర్నర్‌కు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇంటలెక్చువల్ రాష్ట్ర


పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అన్నా

కార్యదర్శి డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషీర్‌అలీబేగ్, ఎఎంసి మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మార్కాపురం జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైసిపి మార్కాపురం పట్టణ అధ్యక్షులు, 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ షేక్ సలీం, 25వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చాటకొండ చంద్రశేఖర్, కొనకనమిట్ల వైస్ ఎంపిపి మెట్టు వెంకటరెడ్డి, పొదిలి పట్టణ వైసిపి అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పొదిలి మండల వైసిపి అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డి, వైసిపి నాయకులు బండి క్రిష్ణారెడ్డి, గుంటక చెన్నారెడ్డి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, పిఎల్‌పి యాదవ్, గొలమారి సత్యనారాయణరెడ్డి, బొగ్గు రవిచెన్నారెడ్డి, వేల్పుల చెన్నారెడ్డి, బొగ్గరపు శేషగిరిరావు, చాటకొండ నాగరాజు, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, రఫి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

రైతు సంఘం మండల మహాసభలో జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు

ప్రజాశక్తి-తర్లుపాడు

వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంతిబాబు డిమాండ్ చేశారు. తర్లుపాడు స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం జరిగిన రైతు సంఘం మూడో మండల మహాసభల్లో ఆయన మాట్లాడారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతానికి ఆశాజ్యోతి అయిన వెలుగొండ ప్రాజెక్టును రాజకీయ నాయకుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 30 సంవత్సరాల నుంచి పనులు నత్తనడక జరుగుతున్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని


మాట్లాడుతున్న జయంతిబాబు

హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల ఆన్‌లైన్ సమస్యలు, సర్వే సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. తర్లుపాడు గేట్ క్వార్టర్‌లో ఒక రైతు ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించి సుమారు ఆరు నెలలైనా అధికారులు నిర్లక్ష్య కారణంగా నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదని, దీనిపైన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏరువ పాపిరెడ్డి అధ్యక్షత వహించగా ఈ మహాసభల్లో రైతు సంఘం జిల్లా నాయకులు డి సోమయ్య, మార్కాపురం మండల కార్యదర్శి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య తర్లుపాడు మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ కన్వీనర్‌గా ఏరువ పాపిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కోలగట్ల సత్య నారాయణరెడ్డి, పిన్ని ఆవులరాజు, గాలి నెమలిరెడ్డి, కోలగట్ల శ్రీనివాసరెడ్డి, పొట్లపాటి కాశయ్య, దొడ్డా సుబ్బారెడ్డి, రావి చిన్న కాశిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.


ఎంపీడీవో అన్నమ్మను శాలువాతో సత్కరిస్తున్న సర్పంచుల సంఘం అధ్యక్షులు డిపి మస్తాన్

ఎంపీడీవోకు సర్పంచుల సంఘం సత్కారం

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు మండల అభివృద్ధి అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓ అన్నమ్మను మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించారు. సర్పంచులు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. గతంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిధులు అరకొరగా పంచాయతీలకు రావడంతో, సర్పంచులు అప్పులు తెచ్చి మరీ పంచాయతీలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. త్వరలో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవరకొండ సుజాత, ఏవో బుర్రి చంద్రశేఖర్, టైపిస్ట్ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుభాకర్, చైతన్య తదితరులు ఉన్నారు.


పెదనాన్న కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సత్య

వెంకట కృష్ణారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తండ్రి వెంకట కృష్ణారావు జన్మదిన వేడుకలు తూర్పునాయుడు పాలెంలో ఘనంగా ఆయన నివాసంలో జరిగాయి. ఆంధ్ర ప్రదేశ్ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పెదనాన్న వెంకట కృష్ణారావుకు పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనార్ధనరావు సోదరులు దామచర్ల శ్రీమన్నారాయణ, దామచర్ల జనార్ధనరావు సతీమణి నాగసత్యలత, కుమార్తె అనీషా లక్ష్మీ, వెంకట కృష్ణారావుతో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలు జరిపారు. ఒంగోలు పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి శీతారామయ్య, ఒంగోలు వ్యవవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, పలువురు టిడిపి నాయకులు కృష్ణారావు జన్మదిన వేడుకలలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ప్రధానమైందని, విద్యార్థులు చదువుతో పాటు మానసిక ప్రశాంతతను కాపాడుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్య నిపుణురాలు కె పద్మావతి విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులు, ధ్యానం, యోగా లాంటి సాధనాల వల్ల కలిగే లాభాలపై విశదీకరించారు. విద్యార్థులు సానుకూల ఆలోచనలతో ముందుకు సాగితే అన్ని సమస్యలను అధిగమించగలరని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా వినిపించారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వీరాయపాలెం గ్రామస్థులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - కురిచేడు

మండలంలోని పడమర వీరాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులు కె ఆదినారాయణ, షేక్ ఖాదర్‌వలి, వి రామచంద్రరావు, కె విజయమేరిలను గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు వస్త్రాం నాయక్, సుబ్బారావు, వైఆర్ జెడ్‌పి స్కూలు హెచ్‌ఎం టివి సుబ్బారావు, హెచ్‌ఎం కె హిమజ కుమారి, యుటిఎఫ్ అధ్యక్షులు అన్నెం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, ఆర్ శ్రీనివాసరెడ్డి, ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా రహంతుల్లా, సిహెచ్ శివరామకృష్ణ, రిటైర్డు హెచ్‌ఎం పచ్చా పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని నేరేడుపల్లి జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఒ జివి కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే భోజనాన్ని పిల్లలు తినే విధంగా రుచికరంగా చేయాలని సిబ్బందికి సూచించారు. రుచి చూసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హైస్కూల్ శ్యాం ప్రసాద్, సర్పంచి పల్లా మల్లికార్జున ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరైనట్లు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. తొలి విడతలో రూ.6.25 కోట్లతో 67 పనులు, రెండో విడతలో రూ.11.75 కోట్లతో 94 పనులు మంజూరైనట్లు తెలిపారు. ఉప్పుటూరు, వీరన్నపాలెం, పోతుకట్ల, చెరుకూరు, భూషయాపాలెం, గొల్లపూడి, చిన్ననందిపాడు, అన్నంబోట్లవారిపాలెం, గర్నెపూడి, ఎడారిపల్లి, తిమ్మరాజుపాలెం, నూతలపాడు, కొల్లవారిపాలెం, నాగులపాలెం, దేవరపల్లి, పర్చూరు, బోడవాడ, అడుసుమల్లి, ఇనగల్లు, కొమర్నెనివారిపాలెం, తన్నీరువారిపాలెం, రమణయపాలెం, చెన్నుంబోట్లవారిపాలెం, ఏదుబాడు, పెద్దివారిపాలెం గ్రామాల్లో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రభుత్వం నిర్దేశించిన పని పట్ల అలసత్వం వహించే సచివాలయ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కొంతమంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చెప్పిన పని చేయకుండా తప్పించుకొని తిరుగుతున్నారని అన్నారు. వారిచేత పని చేయించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనిని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలు పాటించాల్సిందేనని చెప్పారు. హాజరు రెండు పూటల వేయాలని అన్నారు. ఇన్చార్జి ఎంపిడిఒ కె సత్యనారాయణ స్వమిత్య సర్వేపై అవగాహన కల్పించారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని విఠల్ నగర్‌లో రోడ్డుపై ఆడుకుంటున్న ఓ చిన్నారిపై వీధి కుక్కలు గుంపుగా దాడి చేశాయి. కుక్కల దాడిలో బాలిక తీవ్రంగా గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కుక్కల్ని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కల బెడత తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల

ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విద్యపై మంచి ఆదరణ ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం సీట్ల సంఖ్య పెంచలేకపోతోంది. బాపట్ల ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ కళాశాల్లో గతేడాది ఎంటెక్ కోర్సు ప్రవేశపెట్టినప్పటికీ కేవలం మూడు సీట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఏడాది తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్లో అదే సంఖ్య పరిమితం చేశారు. ఫుడ్ సైన్స్ కోర్సు పట్ల విద్యార్థులకు ఆసక్తి ఉన్న సీట్లు పెంచడంలో విశ్వవిద్యాలయం చర్యలు తీసుకోవడం లేదు. ఎంటెక్ ఫుడ్ సైన్స్ ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించారు. బాపట్లలో ముగ్గురు, పులివెందులలోని కళాశాలలో మూడు సీట్లు కేటాయించారు. ఫుడ్ సైన్స్ ఎంటెక్ చదివే సంఖ్య ఈ రెండు కళాశాలల్లో ఆరుగురు మాత్రమే. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో బాపట్ల, పులివెందుల ఈ రెండు కళాశాలల్లోనే ఫుడ్ సైన్స్ కోర్సు నిర్వహిస్తున్నారు. 2003లో బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాల ఏర్పాటు చేశారు. 2008లో పులివెందుల కళాశాల ఏర్పాటైంది. ఈ రెండు కళాశాలలో 500 మంది విద్యార్థులు ఫుడ్ సైన్స్ బీటెక్ చదువుతున్నారు. తాజాగా గతేడాది బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాలలో ఎంటెక్ కోర్సు ప్రవేశపెట్టింది. ఈ ఏడాది పులివెందులలో ఈ కోర్సు ప్రారంభించనున్నారు. ఇంటర్‌లో బైపిసి, ఎంపీసీ కోర్సులు చేసిన విద్యార్థులు ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారు. నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. కోర్సు పూర్తయిన అనంతరం అనేక ప్రైవేటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. బ్రిటానియా, హార్లిక్స్ వంటి పేరు గడించిన పెద్ద పరిశ్రమల్లో ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. బాపట్లలో 120మంది బీటెక్ చదువుతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో ఈ కోర్సు కేవలం 500 మంది మాత్రమే చదువుతున్నారు. బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాలలో ఈనెల 18వరకు ఎంటెక్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఫుడ్ సైన్స్ అసోసియేట్ డీన్ సర్దార్ బేగ్ తెలిపారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా హాకీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

ఉమ్మడి గుంటూరు జిల్లా హాకీ జట్ల ఎంపిక మండలంలో చెరువు జమ్ములపాలెం జెడ్‌పి హై స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14 బాల, బాలికల హాకీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18మంది బాలురు, 18 మంది బాలికలను ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లను ఎంపిన చేసినట్లు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎం గోపి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 25 నుండి 27 వరకు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంఈఓ2 డి ప్రసాదరావు, హెచ్‌ఎం యువి కృష్ణారావు, బి గంగాధర్, పిడి రవిచంద్ర, సాంబశివరావు, సుసీల, రాంబాబు, కరణం బలరాం, పి బసంత్, ఎస్ఎంసి చైర్మన్ నాగరాజు, హాకీ కోచ్ వెంకట్, వి జ్యోతి పాల్గొన్నారు.



ఎంపికైన హాకీ జట్టుతో ఉపాధ్యాయులు

ప్రైవేటీకరణతో పేదలు వైద్య విద్యకు దూరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి ఇన్చార్జ్ దద్దాల

ప్రజాశక్తి - కనిగిరి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవటమేనని వైసిపి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, గుంటక తిరపతిరెడ్డి, సూరసాని మోహనరెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, కటికల వెంకటరత్నం, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, జి ఆదినారాయణరెడ్డి, రమణబోయిన శ్రీనివాసులు, మల్లెల యాకోబు, భూమిరెడ్డి కొండారెడ్డి, దమ్ము వెంకటయ్య, పల్నాటి భాస్కరరెడ్డి, మూలే మాలకొండరెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి పాల్గొన్నారు.

దర్శి : స్థానిక వైసిపి కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్ వైసిపి అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ఇత్తడి దేవదానం, దేవప్రసాద్, కేసరి రాంభూపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కౌన్సిలర్స్ మేడగం మోహన్‌రెడ్డి, బాబురావు, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, కొడవటి జాన్, సామ్యూల్, నలదిమ్ము రమణారెడ్డి, మజున్‌వలి, చెరుకూరి జగన్, శ్రీను పాల్గొన్నారు.

రేపల్లె : వైసిపిపై దుమ్మెత్తిపోయటం కూటమి నాయకులకు నిత్య కృత్యమైందని వైసీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు విమర్శించారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంక్షేమ పాలన సాగించి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్న జగన్మోహన్‌రెడ్డిపై, డాక్టర్ గణేష్‌పై బురద చల్లే యత్నాలు విరమించుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైసీపీ నాయకులు చిమట బాలాజీ, చిత్రాల ఓబేదు, నాగలక్ష్మి, అబ్దుల్ ఖుద్దూస్, పల్లెం శ్రీనివాసరావు, బండ్రెడ్డి ఉమారాణి, ఖాదర్, గోపి, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి రేపల్లె అధ్యక్షులు కరేటి శేషగిరావు

ప్రభుత్వమే వైద్య కళాశాల నిర్మించాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ నిధులతోనే వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణ జరపాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుదే రాజారావు అన్నారు. వైద్య కళాశాలను పిపిపి పద్ధతిలో ప్రవేటుకు ఇవ్వడానికి వ్యతిరేకంగా బిఎస్పి ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణం మధ్యలో ఆగిపోవడం ప్రజలకు తీవ్ర నిరాశ కలిగిస్తోందని అన్నారు. బీఎస్పీ ఇన్‌చార్జ్ చిట్టిమల సంగీతరావు, పాలపర్తి సంతమ్మ, నల్లమోతు శామ్యూల్, జాన్సన్, ఏపూరి జోసఫ్, కటారి గోపి, పి శివప్రసాద్, అద్దంకి శివ పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న గుదే రాజారావు

సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ప్రజాశక్తి-దర్శి

పేద, మధ్యతరగతి ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం అప్పుల పాలు కాకూడదన్న సీఎం చంద్రబాబు సంకల్పం మేరకు గత 15 నెలల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎఓసిలు అందిస్తోందని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. 98 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.54.50లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. మాజీ ఎంఎల్ఎ నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, మరెళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎవి కవిత శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 16న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కాలేజీలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని వెంకటాచలంపల్లిలో భూసార పరీక్షా ఫలితాల కార్డుపై అవగాహన కల్పించారు. డిఆర్‌సి ఎఓ వివి శేషమ్మ భూసార పరీక్షా ఫలితాల కార్డుల గురించి వివరించారు. మోడల్ స్కూల్‌లోని 8, 9వ తరగతుల విద్యార్థులకు భూసార పరీక్షల గురించి శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిఎ కె బాలాజీనాయక్, ఎడిఎ ఎస్ సుచరిత పాల్గొన్నారు.

సిపిఆర్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్డియోపల్మోనరీ రిససిటేషన్ ప్రాణరక్షణ పోస్టర్‌ను టిడిపి ఇంచార్జ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆవిషరించారు. సిపిఆర్ అనేది గుండె కొట్టుకోవడం లేదా శ్వాస ఆగిపోయిన సమయంలో చేసి ప్రాణాలు కాపాడే అత్యవసర చికిత్సా ప్రక్రియ అన్నారు.

మహిళలకు గృహ విజ్ఞాన శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలకు రెసిన్ ఆర్ట్‌పై వృత్తి విద్యా శిక్షణ ఈ నెల 8నుండి 10వరకు కెవికె సమన్వయకర్త డాక్టర్ జి రమేష్ అధ్వర్యంలో నిర్వహించారు. కెవికె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి మానస మాట్లాడారు.



డిటికి వినతిపత్రం ఇస్తున్న విఆర్ఎ సంఘం నాయకులు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పామూరు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహశీల్దారుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్ఎ సంఘం నాయకులు నారాయణమ్మ మాట్లాడారు. అక్టోబర్ 13, 14 తేదీల్లో దీక్షలు, 15న విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికీ హామీలు నెరవేర్చలేదని అన్నారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, కొండమ్మ, రమేష్, జ్యోతి పాల్గొన్నారు.

ఈకెవైసి చేయించుకుంటేనే ఉపాధి

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

ఉపాధి కూలీలు ఈకెవైసి చేయించుకుంటేనే నవంబర్ 1 నుంచి ఉపాధి హామీ పనులు కల్పించడం జరుగుతుందని ఎపిఒ వి శ్రీనివాస నాయక్ తెలిపారు. ఈకేవైసీ నమోదును ఆయన పరిశీలించారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

పుట్ట బజార్‌లో విద్యార్థులు, గ్రామస్తులకు గొర్రె నాగేశ్వరరావు ద్యక్షతన పరిటాల సురేష్ మొక్కలు పంపిణీ చేశారు. మానవవాళి మనుగడకు మొక్కలు లేకపోతే ప్రమాదం పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో గొర్రె నాగేశ్వరరావు, అస్సాం, షడ్రక్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 11 అక్టోబర్ 2025

తెగిపడిన పడిన విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యుత్ వైర్లు తెగి పడి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని వలపర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. వలపర్ల మెయిన్ రోడ్డులోని సినిమా హాలు సెంటర్లో విద్యుత్ వైర్లు ఒక్కసారిగా తెగి క్రింద పడటంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. వైర్లు తెగిన వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వలపర్లలో గత కొన్నేళ్లుగా విద్యుత్ స్థంబాలు శిథిలావస్థకు చేరి చేతికి అందే ఎత్తులో వైర్లు ఉన్నాయని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నేడే మంత్రి గొట్టిపాటి రాక

ప్రజాశక్తి - పంగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని కొండ మంజులూరు శనివారం వస్తున్నట్లు తెలుగుదేశం నాయకులు చింతల సహదేవుడు శుక్రవారం తెలిపారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

తెల్లరాయి క్వారీపై అధికారుల దాడులు

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని మురుగుమ్మి పొలాల్లో అక్రమంగా తెల్లరాయి తీస్తున్న క్వారీలపై మార్కాపురం మైనింగ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. క్వారీలోని రాళ్ళను తీస్తున్న జెసిబిని మైనింగ్ అధికారి బాల రాజ్ స్వాధనం చేసుకున్నారు. ఆయన వెంట విఆర్ఒ రఫీ అహ్మద్ ఉన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

ధ్రువ జీవామృతం, బీజామృతం, దశపర్ణి కషాయం, అగ్నిస్త్రం కషాయాలు ఎలా తయారు చేయాలో రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించారు. మండలంలోని రామకూరులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పకృతి వ్యవసాయం సాగు చేయు పద్ధతులపై ప్రదర్శన నిర్వహించారు. ఎఒ డి సుబ్బారెడ్డి, ఎఎ సిహెచ్ హరి, ఆత్మ ఎటిఎం అక్షరరాణి, ఎస్ రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దంకి : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం సాధ్యమని ఎడిఎ బి ఎఫ్రాయిం అన్నారు. మండలంలోని చినకొత్తపల్లిలో గో ఆధారిత వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హుస్సేన్ జీవామృతం రైతులకు అందుబాటులో ఉంచి తక్కువ ధరకు అందిస్తుందని తెలిపారు. ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ, నరిశెట్టి రమేష్, నరేంద్ర, అశోక్, కోకిల, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - పీసీపల్లి

బాల్య వివాహాలు, పోషకాహారం, విటమిన్లపై కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. పెదవరిమడుగులో కనిగిరి ఐసిడిఎస్ సిడిపిఒ సరోజిని ఆదేశాల మేరకు సూపర్ వైజర్ సుమతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అంగన్వాడి కార్యకర్త విజయ కుమారి, డి గోపి పాల్గొన్నారు.

చెరుకుపల్లి : బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కావూరు సర్పంచ్ చెల్లి జ్యోతి రవికుమార్ అన్నారు. సర్పంచ్ చెల్లి జ్యోతి రవికుమార్, హెచ్ఎం వనజాక్షి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కెవ సుబ్బమ్మ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

ప్రజాశక్తి - కర్లపాలెం

జిఎస్‌టి తగ్గింపు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దారు షాకీర్ పాషా పాల్గొన్నారు.

పర్చూరు : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. ఇంకొల్లు రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ, ఎంఈఓ వెంకట్రామయ్య, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు పాల్గొన్నారు.

దర్శి : జిఎస్టి తగ్గింపు సామాన్యులకు మేలు చేస్తుందని టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. సదస్సులో నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత సాగర్, ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కల్పన, ఎఇ శ్రీరామమూర్తి, మరెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీమౌత్ కాలువ పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - చీరాల

రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈపూరుపాలెం స్ట్రైట్‌కట్ కాలవ సముద్రంలో కలిసే సీమౌత్ ఒంపును పూడ్చివేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను బాపట్లలో కలిసి వినత పత్రం శుక్రవారం అందజేశారు. తాము సీ మౌత్ వంపులో తుఫానులు, ఇతర సమయాల్లో పడవలు సురక్షితంగా ఉంచుకునేవాళ్లమని వివరించారు. పకృతి విపత్తుల సమయంలో తమ పడవలు సురక్షితంగా ఉండేవని వివరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువను ఆక్రమించుకొని ఎల్ షేప్ కాలువను బండ రాళ్లతో పూడ్చి వేశారని తెలిపారు. దీనివల్ల బోట్లు దెబ్బ తింటున్నాయని వివరించారు. గతంలో 11 గ్రామాల మత్స్యకారులు ధర్నా చేసినప్పుడు అప్పటి కలెక్టర్ జె వెంకట మురళి మాకు న్యాయం చేస్తామని, కాలువ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. దీనిపైన స్పందించిన ఎంపి న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు.



ఎంపి కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

బియ్యం పంపిణీ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

రేషన్ బియ్యం పంపిణీ, కార్డుల మ్యాపింగ్ సమస్యలపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహశీల్దారు గోపి కృష్ణ, ఇతర అధికారులు మాట్లాడారు. పట్టణంలోని వివిధ వార్డుల కౌన్సిలర్లు రేషన్ బియ్యం సరఫరా లోపాలు, రేషన్ కార్డుల మ్యాపింగ్, సాంకేతిక సమస్యలు, ఇతర ప్రజా సమస్యలు చర్చించారు. తహశీల్దారు గోపి కృష్ణ స్పందిస్తూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు గోపికృష్ణ

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడి సూపర్ వైజర్ సుష్మా రాణి ఆధ్వర్యంలో బాలికలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం', బేటి బచావో, బేటి పడావో అనే అంశాలపై వ్యాసరచన పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. విజేతలకు ఎంఇఒలు వేమవరపు కోటేశ్వరరావు, దినేష్ కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జాన్సన్, ఉపాధ్యాయులు విక్టర్ డేవిడ్, ఎంఎస్‌కె భార్గవి, ప్రసన్న, అంగనవాడి కార్యకర్తలు శైలజ, అనురాధ, రమాదేవి, పద్మ, ఎస్తేరురాణి, మరియమ్మ పాల్గొన్నారు.

పంగులూరు : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాపట్లలో జరిగిన జిల్లా స్థాయి వకృత్వ పోటీలో మండలంలోని చందలూరు పాఠశాల విద్యార్థిని అమ్మిశెట్టి మణిదీపిక తృతీయ బహుమతి పొందారు. సేవ్ ది గర్ల్ అండ్ చైల్డ్ అనే అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. కలెక్టర్ వి వినోద్ కుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. పాఠశాల హెచ్ఎం చందలూరు గిరిజ అభినందించారు.

చీరాల : విద్యార్థులు చదువులతో పాటు ఆటలలోనూ సత్తా చాటాలని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ అన్నారు. కళాశాల క్రీడామైదానంలో ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం చింపారెడ్డి పర్యవేక్షణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 యువతీ, యువకుల వాలీబాల్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పుష్పరాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆటలలో పాల్గొనడం శారీరక బలం, మానసిక ప్రశాంతత కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీబీహెచ్ పిడి సుబ్బారెడ్డి, రిటైర్డ్ పిడి డిసి విద్యాసాగర్, విస్తార్ల విజ్ఞాన్ కుమార్, షిపోరా, డాక్టర్ గారపాటి మంజుల, సుమ, చినపాప, షీలా, గాస్పర్, జాస్మిన్ గోల్డ్ పాల్గొన్నారు.

మానసిక వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం

ప్రజాశక్తి - పర్చూరు

మానసిక వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని ఉప్పుటూరు ప్రభుత్వ హెూమియో వైద్యులు డి చంద్రశేఖర్ తెలిపారు. మానసిక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి మనసే ప్రధానమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

అద్దంకి : పట్టణంలోని భవిత కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. న్యాయవాది షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడారు. విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మద్దినేని గృహలక్ష్మి, శ్రీనివాసరావు, హెచ్ఎం గర్నెపూడి శ్యామ్ కుమార్, ధనలక్ష్మి, జయకుమారి, బాబురావు, కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా పాల్గొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ యలగాల హనుమంతరావు, బాచిన శివధర పూర్ణచంద్రరావు, అలహరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, యు దేవపాలన, చిన్ని మురళీ కృష్ణ, చప్పిడి వీరయ్య, అద్దంకి లేవీ ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కనిగిరి : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమేనని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఎస్‌కెఆర్ మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల నందు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి రూపశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయసేవాధికా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు అర్నూరి తిరుపతయ్య, మదన్ మోహనరెడ్డి పాల్గొన్నారు.

రేపల్లె : న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వెన్నెల ఆదేశాల మేరకు మానసిక దినోత్సవం సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోని భవిత స్కూల్ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ నాగమల్లేశ్వరరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్, ఆలా మోషే, ఆర్ శ్రీనివాసరావు, ఆచారి, ఆదర్శ వేదిక కన్వీనర్ వై కిషోర్ బాబు, భవిత ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.

దర్శి : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలోని విద్యార్థులకు న్యాయ సేవాధికార సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పారాలీగల్ వాలింటీర్ కపురం శ్రీనివాసరెడ్డి, న్యాయవాది పరిటాల సురేష్, పద్మ, సుబ్రమణ్యం, గురువర్ధనరావు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

క్రాపలో ఎన్టీఆర్ విగ్ర ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని క్రాప గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని శాసన సభ్యులు నక్క ఆనందబాబు, ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ శుక్రవారం విగ్రహావిష్కరించారు. విగ్రహ దాత తలశిల సీతారాంబాబు కుమారుడు ఆధ్వర్యంలో జరిగిన టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్ పాల్గొన్నారు.



జంకె వెంకటరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వెంకటరెడ్డికి ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - పామూరు

మార్కాపురం మాజీ శాసన సభ్యులు జంకె వెంకటరెడ్డిని పామూరు వైసీపీ నాయకులు శుక్రవారం వైసిపి కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మాన చేశారు. నెల్లూరు జిల్లా ఇరువురు గ్రామంలో వైసీపీ కార్యక్రమానికి వెళుతూ పామూరుకు వచ్చారని వైసీపీ అధ్యక్షులు గంగసేను హుస్సేన్‌రెడ్డి తెలిపారు. కె రామిరెడ్డి, గట్ల భాస్కర్, విజయ్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, చల్లా సుబ్బారావు, బాలిరెడ్డి, గోవిందయ్య, శ్రీను పాల్గొన్నారు.

వైసీపీ పరిశీలకులుగా గోపాలం రాము

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి చుండూరు మండల కన్వీనర్ అన్నపురెడ్డి రఘురామరెడ్డి ఆధ్వర్యంలో వలివేరు గ్రామంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జిలను నియమిస్తున్నట్లు తెలిపారు. నాయకులతో కలిసి అశోక్ బాబు క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరణ చేశారు.



జోసఫ్ మృత దేహానికి నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

జోసఫ్ చార్లెస్‌కు నివాళులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోనకు చెందిన వైసిపి నాయకులు జంగం జోసఫ్ చార్లెస్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు గ్రామానికి వెళ్లి జోసఫ్ మృతదేహానికి నివాళులర్పించారు.

అంబేద్కర్ దమ్మ దీక్ష దిన వేడుకలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బౌద్ధ దీక్ష చేపట్టిన అక్టోబర్ 14న స్థానిక బౌద్ధ క్షేత్రం వద్ద 70వ దమ్మ దీక్షా దిన వేడుకలు నిర్వహించనున్నట్లు బుద్ధిస్టు సొసైటీ కార్యదర్శి దోవా రమేష్ రాంజీ తెలిపాఆరు. బౌద్ధ స్తూపం వద్ద కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు పర్రె కోటయ్య, చల్లపల్లి కోటేశ్వరరావు, ధోనెపాటి ప్రసాద్, చేబ్రోలు జాకబ్, పేర్లి మోజెస్ పాల్గొన్నారు.

పది రోజుల్లో బండరాళ్లు తొలగించాలి

ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువను పునరుద్ధరించాలి

వెంకట్రావుకు నోటీసులిచ్చిన అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల-చీరాల సరిహద్దుల్లోని ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ అంచుల్లో వేసిన బండరాళ్లను పది రోజుల్లో తొలగించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ నియమించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ రియల్టర్ బుర్ల వెంకట్రావుకు నోటీసులు జారీ జారీచేసింది. ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ వంపును బుర్ల వెంకట్రావ్ పూడ్చివేసి, అక్కడ పెద్దపెద్ద బండరాళ్లను వేసిన నేపథ్యంలో తమ బోట్లు దెబ్బతింటున్నాయని 10 గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న జిల్లా కలెక్టర్ మత్స్యకారులు, అధికారులతో చీరాల ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 9 గ్రామాల మత్స్యకారులు ఆ కాల్వపై ఆధారపడి సముద్రంలో వేట సాగిస్తున్నామన్నారు. సదరు కాలువ పూడ్చిన విషయమై ఆర్డీవోలు, మత్స్య శాఖ అధికారులు, పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో వివాదాస్పద ప్రాంతాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు పరిశీలించి కాలువలో నీటి ప్రవాహానికి, సముద్రం నుంచి మర పడవల రాకపోకలకు అంతరాయం ఉందని నిర్ధారించారు. తక్షణమే పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగించాలని జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీ వెంకట్రావును ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చారు.

పాఠశాలకు మైక్‌సెట్, బీరువా బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

గోనుగుంట పాఠశాలకు చీమకుర్తి విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్ పూనాటి వెంకట్రావు మైక్‌సెట్, బీరువాను బహూకరించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓలు డివిఎల్ నరసింహారావు, కె.శివాజీలు, క్లస్టర్ ఛైర్‌పర్సన్ బండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రమణయ్య, ఉపాధ్యాయులు బి.రమాదేవి, కె.శ్రీ మిథిల, సర్పంచ్ సాధు మోహన్ రావు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ పివిడి వరప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏడీ పివిడి వర ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలలకు ఆయాలను నియమిస్తే టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ ఇస్తామన్నారు. విద్యార్థులు లేని 17 పాఠశాలల్లో పనిచేసే 48 మంది ఉపాధ్యాయులకు త్వరలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎయిడెడ్ విద్యార్థులకు ఐఎఫ్ఎల్, తరల్ కిట్లపై కమిషనర్‌కు వివరణ ఇస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రెవెన్యూ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిపై వచ్చే అర్జీలపై క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.రాజాబాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసులతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశమయ్యారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, జిల్లాకు సంబంధించిన ఐవిఆర్ఎస్ కాల్స్ వంటి అంశాలపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ సమస్యపై విఆర్ఓ క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలన చేసి నివేదిక ఇవ్వడం, తహశీల్దార్ నోటీసు, స్పీకింగ్ ఆర్డర్స్ జారీ పారదర్శకంగా, కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జెసి ఆర్ గోపాల కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కనిగిరిలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 814 దరఖాస్తులు రాగా, అందులో 587 దరఖాస్తులు రెవెన్యూ సంబంధిత సమస్యలపై వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్డీవో కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, సత్యనారాయణ, శివరామిరెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ గౌస్ బాషా, తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం
ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహిళా సమానత్వం సాధన కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీనగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం వద్ద రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకొని ఐద్వా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆంధ్రలో మహిళా ఉద్యమాలు సాంప్రదాయాలను ధ్వంసం చేస్తూ, సమాన హక్కుల సాధనకు మార్గం చూపాయని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితోనే 1981లో మద్రాసులో ఐద్వా ఆవిర్భవించిందని తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరిగే మహాసభల్లో మహిళా సమానత్వం కోసం నూతన



మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

పోరాటాల దిశా నిర్దేశం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షురాలు యస్.డి.అమీరున్నీస్సా, కె.నాగమణి, కోటమ్మ, పి.సుజాత, సరోజనమ్మ, యం.సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో....

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మోటరు ఉదయం కాలనీ, భగత్‌సింగ్ కాలనీలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా ఒంగోలు నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ అనంతపురంలో అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో స్త్రీ సమానత్వం, విముక్తి కోసం అందరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యనిషేధంపై ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, నకిలీ మద్యం పెరుగుదలకు దారితీసిందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో కె. విజయలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, కె.రాజేశ్వరమ్మ, కె.గురు, కె.గురవమ్మ, కె.భూలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాల్య వివాహ రహిత జిల్లా దిశగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ చే ముద్రించిన బాల్యవివాహాలు – చట్ట రీత్యా నేరం, ఉచిత అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్లు, చైల్డ్ హెల్ప్ లైన్ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్, ఎంపీలు ఆవిష్కరించారు. అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలలో 6 వ తరగతి నుంచి 10 వ తరగతి చదివే విద్యార్థులకు సమాజంలో బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం వంటి అంశాల పై నిర్వహించిన వ్యాసరక్షణ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జెసి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ పిడి రాధమాధవి, గుంటూరు, ప్రకాశం జిల్లాల జడ్జీ సిఈఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వి.వినోద్ కుమార్

జిఎస్‌టి తగ్గింపు పేదలకు వరం

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జీఎస్టీ ద్వారా అత్యంత మేలు చేకూర్చే కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం సామాన్య మధ్య తరగతి ప్రజలకు వరం వంటిదని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు తెలిపారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో 'గ్రేట్ ప్రకాశం డిస్ట్రిక్ట్ షాపింగ్ ఫెస్టివల్' పేరుతో ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి ఫలాలు మంచి ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లా వాణిజ్య పన్నుల శాఖ చేసిన కృషిని, ఈ విషయంలో సహకరించిన వాణిజ్య సంఘాలను ఎమ్మెల్యే దామచర్ల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

అభినందించారు. అనంతరం సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఎమ్మెల్యే దామచర్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ సత్య ప్రకాష్, అసిస్టెంట్ కమిషనర్లు పి రవికుమార్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ కోటేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండలో విమానాశ్రయం అభివృద్ధి

మంత్రి వర్గసమావేశంలో సిఎం ప్రస్తావన

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

దొనకొండలో విమానాశ్రయం ఏర్పాటుపై మంత్రివర్గ సమావేశంలో సిఎం చంద్రబాబు ప్రస్తావించారు. దొనకొండలో ఈపాటికే రెండో ప్రపంచయుద్ధం నాటి ఎయిర్‌స్ట్రిప్ ఉందని, దాన్ని చిన్న విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు సమావేశంలో సూచించారు. దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రం ప్రకటించినప్పటి నుంచీ ఇక్కడున్న విమానాశ్రయం అభివృద్ధి తెరపైకి వచ్చింది.ఇటీవల దీని చుట్టూ ఉన్న భూములపైనా జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. సమీప గ్రామాల్లో మరికొంత భూమిని సేకరించాలని నిర్ణయించారు. శుక్రవారం నాడు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఇక్కడ విమానాశ్రయం అభివృద్ధిపై స్వయంగా సిఎం చంద్రబాబు ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దొనకొండ వద్ద విమానాశ్రయంపై సమావేశంలో చర్చ జరిగిందని, సిఎంచంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారని మంత్రి డాక్టర్ డోలాశ్రీబాలవీరాంజనేయస్వామి ప్రజాశక్తికి తెలిపారు.

కల్తీ మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలి

వైసిపి మహిళా విభాగం ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం తయారీ, విక్రయాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలపై వైసిపి మహిళా విభాగం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం వైసిపి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉదయం కల్తీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ భవనం నుంచి శాంతియుత ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికార పార్టీ అండతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు ఏర్పాటు చేసి, ఒక్కో ప్రాంతాన్ని పంచుకుని కల్తీ మద్యం సరఫరా చేస్తున్నారని మహిళలు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, రాష్ట్ర మహిళా జోనల్



ఆందోళన చేస్తున్న వైసిపి మహిళా నేతలు

ప్రెసిడెంట్ మరియు పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి, హెచ్ఎం పాడు ఎంపిపి గాయం సావిత్రి,రాష్ట్ర మహిళా కార్యదర్శి,భూమిరెడ్డి రవణమ్మ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి రవణమ్మ,రాష్ట్ర వాలంటరీ సెక్రటరీ గోనెల మేరీ కుమారి , మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ, సయ్యద్ అప్సర్, పులి శాంతి, వడ్డమూడి వాణి, కాకర్లమూడి రజని పాల్గొన్నారు.

సిజెపై దాడికి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-మద్దిపాడు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై బూటు విసరడం అత్యంత అమానుషమైన చర్య అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ అన్నారు. జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా శుక్రవారం వెంకటరాజుపాలెం, మద్దిపాడు అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత తిరుపతి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు, కనపర్తి సుబ్బారావు, పాల్గొన్నారు.